సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత



ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: బాలసరస్వతీనగర్‌కు చెందిన శరన్ ఎలివెన్ చికిత్సకు సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వైద్య ఖర్చులకు ఆయనకు రూ.2 లక్షలు మంజూరు కాగా.. ఎల్‌ఓసీ పత్రాన్ని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అందజేశారు. మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, వెంకన్న, ఉపేందర్, నవీన్, జనార్దన్, సతీష్ పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



మినీ శిల్పారామంలో ప్రదర్శనతో కళాకారులు

ఉప్పల్ : ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం అభినయ కూచిపూడి కళాక్షేత్ర గురువు పావనీశ్రీలత ప్రసాద్ శిష్య బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. రంగ పూజశ్రీ, గణపతిమ్, విన్నపాలు, నమశ్శివాయ, జతిస్వరం, ఇదిగో భద్రాద్రి, దశావతార శబ్దం లాంటి అంశాలను శ్రీదేవి, సుదీక్ష, నమ్రత, అలేఖ్యరెడ్డి, జెస్సీకా, మహాత తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

గౌరవ వేతనం అందజేత



వేతనం అందజేస్తున్న కార్పొరేటర్ శాంతి

మల్లాపూర్: నాచారం వెస్లీ కో- ఎడ్యుకేషన్ ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉండటంతో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి విద్యార్థుల కోసం ఉపాధ్యాయురాలిని నియమించారు. శనివారం ఎమ్మెల్యే ఇచ్చిన గౌరవవేతనాన్ని టీచర్‌కు నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు కోటేశ్వర్ రావు ,భాషా తదితరులు పాల్గొన్నారు.

భీష్మ ఏకాదశి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ లక్ష్మీ వేంకటేశ్వర దేవస్థానంలో భీష్మ ఏకాదశి సందర్భంగా మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు మాట్లాడుతూ.. మాఘశుద్ధ ఏకాదశినే భీష్మ ఏకాదశి అని పిలుస్తామని, ఈరోజు పాండవులకు విష్ణు సహస్రనామపారాయణాన్ని ఉపదేశం చేశారన్నారు. సమస్త లోక ప్రజలకు విష్ణు సహస్రనామ పారాయణం వలన ఎంతో మేలు జరుగుతుందన్నారు.

రామలింగేశ్వర ఆలయ బోర్డు డైరెక్టర్‌గా శంకరయ్య



బోడుప్పల్: కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి దేవాలయం ట్రస్ట్ బోర్డు డైరెక్టర్‌గా బోడుప్పల్‌కు చెందిన రాపోలు శంకరయ్య నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఆదేశాలు జారీ చేశారు. శనివారం బోడుప్పల్‌లో శంకరయ్యను కాంగ్రెస్ పార్టీ నేతలు యాదగిరి, రాము, జంగయ్య, రాపోలు ఉపేందర్, దర్శన్, రామస్వామి శాలువా కప్పి అభినందించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

అల్వాల్: రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. కానాజిగూడలోని ఓ ఫుడ్స్ గోదామ్‌లో విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌వోటీ పోలీసులు దాడులు నిర్వహించారు. పోలీసుల తనిఖీల్లో చాలా రోజుల నుంచి రేషన్‌బియ్యంతో పిండి వంటలు చేస్తున్నట్లు సమాచారం. సుమారు 10 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని అల్వాల్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు.

పచ్చదనంతో ఆహ్లాదం.. ఆరోగ్యం

- పార్కుల్లో సేదతీరుతున్న ఉద్యోగులు, వృద్ధులు, చిన్నారులు
- కనువిందు చేస్తున్న హరితవనం

హబ్సిగూడ: సామాన్యులు నివసించే ప్రాంతాల్లో ఏకాంతంగా గడపలేరు. ఇంటి యజమాని రోజూ ఉద్యోగం, వ్యాపారం లేదా ఇతర పనుల నిమిత్తం బయట నుంచి తిరిగొస్తారు. పిల్లలు రోజూ స్కూల్‌కు వెళ్లినా... సెలవు రోజుల్లో ఆడవిడుపుగా తిరగాలనిపిస్తుంది. ఇవన్నీ గమనించిన నగర పాలకులు ప్రజల అవసరాల కోసం ప్రతి డివిజన్‌లో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ పార్కులను ఏర్పాటు చేశారు. హబ్సిగూడలోని కాకతీయనగర్‌లో కాకతీయ కో- ఆపరేటివ్ సొసైటీ సహకారంతో హరితవనం పేరుతో పార్కును నిర్మించారు. సుమారు 4 ఎకరాల భూమిలో 1984లో ఈ పార్కును నిర్మించారు. వేయికి పైగా మొక్కలను నాటి సంరక్షిస్తూ.. హరితవనం పార్కు అని నామకరణం చేశారు.

ఉదయం 5 గంటల నుంచి ప్రారంభం..

హబ్సిగూడ మెట్రోస్టేషన్‌కు అతి సమీపంతో అన్ని వర్గాలకు అందుబాటులో ఉండే కాకతీయ పార్కును ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు సందర్శకుల సౌకర్యార్థం తెరిచి ఉంచుతారు.



హబ్సిగూడ కాకతీయనగర్‌లోని హరితవనం పార్కు



హరితవనం పార్కు ప్రవేశ ద్వారం

ప్రజలకు సౌకర్యవంతంగా ఉంది



హబ్సిగూడ కాకతీయనగర్‌లోని హరితవనం అన్ని వర్గాల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంది. పార్కులో పెంచుతున్న వివిధ రకాల మొక్కలు, చెట్లు పచ్చదనంతో పాటు ప్రశాంత వాతావరణం ఉంటుంది. ప్రకృతిలో సహజ సిద్ధంగా లభించే పచ్చదనాన్ని ఆస్వాధించినప్పుడు శారీరక ఆరోగ్యం, మానసిక ఆనందంతో నూతన ఆలోచనలు రేకెత్తుతాయి.

– ఎన్. గౌతమ్‌ప్రసాద్, రాజకీయ విశ్లేషకుడు, హబ్సిగూడ.

40 ఏళ్లుగా నిర్వహిస్తున్నాం

హరితవనం పార్కును 40 ఏళ్ల నుంచి నిర్వహిస్తున్నాం. ఉప్పల్ నియోజకవర్గంలో ఇదే అతిపెద్ద పబ్లిక్ పార్కు. టాయిలెట్లు, తాగు నీటి సౌకర్యాలతో పాటు పిల్లల ఆటవస్తువులు, వ్యాయామ పరికరాలు, వాకింగ్, సైక్లింగ్ ట్రాక్ ఏర్పాటుతో ఈ పార్కుకు ఉదయం, సాయంత్రం సుమారు వేయిమంది దాకా హాజరవుతారు. సలహాలు, సూచనలకు 9949656122.

– నగేష్, పార్కు మేనేజర్.

ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు కృషి



సుచరిత కాప్రా తహసీల్దార్

కాప్రా: కాప్రా మండల పరిధిలోని ప్రభుత్వ స్థలాలు కాపాడటమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని తహసీల్దార్ సుచరిత అన్నారు. కాప్రా వంపుగూడలోని 104 సర్వే నంబర్‌లోని 30 గుంటల ప్రభుత్వ భూమి చుట్టూ శనివారం రెవెన్యూ అధికారులు పెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించాలని చూస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. 104 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమి ఉందని, దీన్ని ఎవరైనా ఆక్రమించినా, అక్రమ నిర్మాణం చేపట్టినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. సదరు స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు తాజాగా ఆ స్థలం చుట్టూ పెన్సింగ్ వేశారు.



వంపుగూడలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

పార్కు అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: హెచ్‌బీకాలనీలోని రాజీవ్‌పార్కును ఆహ్లాదానికి నెలవుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నారు. శనివారం ఆయన రాజీవ్‌పార్కు అభివృద్ధి పనులను పరిశీలించారు. పార్కులో పనిచేయని జిమ్ పరికరాలను పూర్తిగా తొలగించి ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పార్కులో పచ్చదనం ఉండేలా తగిన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. పార్కుకు వచ్చే సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తామన్నారు. లింగారావు, చారి, రామకృష్ణ, బాలనరసింహా తదితరులు పాల్గొన్నారు.

గణితంలో విద్యార్థుల ప్రతిభ

మేడిపల్లి: జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని రామానుజన్ ప్రతిభాశాలి పోటీ పరీక్షల్లో భాష్యం పాఠశాల బోడుప్పల్ శాఖ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జాతీయస్థాయిలో నిర్వహించిన పోటీల్లో రెండో బహుమతి గెలుచుకున్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. పాఠశాల వ్యవస్థాపకులు భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని ఆకాంక్షించారు. భాష్యం పాఠశాల సీఈఓ చైతన్య, జోనల్ ఇన్‌చార్జి అంకమరావు, స్వర్ణకుమారి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఆలయ వార్షికోత్సవానికి ఆహ్వానం

కుషాయిగూడ: కృష్ణానగర్ కాలనీలోని పోచమ్మ, నాగదేవత ఆలయ వార్షికోత్సవానికి రావాలని ఆలయ కమిటీ సభ్యులు కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డిని కలిసి ఆహ్వానం అందజేశారు. ఆలయ చైర్మన్ నర్రా సుఖేందర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షులు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి దేవరాజు, ఎం వీ.రామచంద్రమూర్తి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఉప్పల్: ఉప్పల్ మెట్రో స్టేషన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మారు 55 ఏళ్లున్న వ్యక్తి మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. సదరు వ్యక్తి బిక్షాటన చేస్తూ ఉండే వాడని రెండ్రోజుల క్రితమే మృతి చెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పద్మశాలీల ఆత్మీయ సమ్మేళనం

మల్లాపూర్: పద్మశాలీ సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్ ఎస్వీనగర్ కార్యాలయంలో పద్మశాలీ సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. అనంతరం మార్కండేయ పద్మశాలీ సంఘం కేలండర్‌ను ఆవిష్కరించారు. అధ్యక్షుడు అనంతరామ్, ప్రధాన కార్యదర్శి నర్సింహా, కోశాధికారి మారుతీరామ్, కార్యవర్గ సభ్యులు వేణు, బ్రహ్మం, స్వామినాథన్, శ్రీనివాస్, సతీష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

చెట్ల పొదల్లో నెలల చిన్నారి మృతదేహం

మేడిపల్లి: అభం శుభం తెలియని నెలల చిన్నారి చెట్ల పొదల్లో మృతి చెంది కనిపించింది. మానవత్వం మరిచారో.. శిశువుని వదిలించుకోవాలని చెట్ల పొదల్లో విసిరేశారో వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన రహదారిలో ఉన్న డెకత్లాన్ షోరూం సమీపంలోని ఖాళీ ప్రదేశంలో ఉన్న చెట్ల పొదల్లో చిన్నారి మృతదేహాన్ని చూసిన స్థానికులు 100 డయల్ చేసి సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా.. అప్పటికే కుళ్లిపోయిన స్థితిలో చిన్నారి మృతదేహం ఉంది. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసును దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ విజయోత్సవ సంబరాలు

రామంతాపూర్ : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించినందుకు రామంతాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు వంగాల సంతోష్ గుప్తా ఆధ్వర్యంలో శనివారం ప్రధాన రహదారిలో బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించుకున్నారు. బీజేపీ నేతలు జగదీష్, రాజేశ్వర్, నరసింహ, నారాయణ, తిరుపతయ్య, ఉపేందర్‌యాదవ్, సుధాకర్, మంగమ్మ, భాగ్యలక్ష్మి, వీణ, సుధా తదితరులున్నారు.

మల్కాజిగిరి: కార్పొరేటర్ శ్రవణ్, పార్టీ సీనియర్ నాయకులు బాలచందర్‌గౌడ్, వీకె.మహేష్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. ఢిల్లీలో డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అభివృద్ధి ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు శ్రీనివాస్‌ముదిరాజ్, సునీల్‌యాదవ్, కిరణ్, నవీన్, అభిషేక్ పాల్గొన్నారు.

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్ అధ్యక్షురాలు సంధ్యారెడ్డి ఆధ్వర్యంలో రాధికచౌరస్తా వద్ద బీజేపీ శ్రేణులు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు.

మల్లాపూర్: డివిజన్ బీజేపీ అధ్యక్షుడు గూడూరు శైలేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. నాచారంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కొమ్మగళ్ల నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించుకున్నారు.



సంబరాల్లో బీజేపీ శ్రేణులు

◆ మేడ్చల్ జిల్లా బీజేపీ సీనియర్ నేత సంగిశెట్టి రవీంద్రసాగర్ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచి పెట్టారు. అనంతరం ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

కుషాయిగూడ : మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌లో బీజేపీ డివిజన్ పార్టీ అధ్యక్షుడు మునుగంటి రాంప్రదీప్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. బీజేపీ నేతలు రాజేశ్వరరావు, డీఎల్. ప్రసాద్, లక్ష్మణ్, బాలరాజు, దేవేందర్, లింగం, భాస్కర్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.



మచ్చబొల్లారంలో..

అల్వాల్: మచ్చబొల్లారంలో బీజేపీ నేతలు శనివారం బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

గౌతంనగర్: మల్లిఖార్జుననగర్‌లో నెలకొన్న యుఎల్‌సీ సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు, కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ... మల్కాజిగిరి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ప్రణాళికాబద్ధంగా నెరవేరుస్తామన్నారు. దీనిపై ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశామని చెప్పారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి యుఎల్‌సీ సమస్య పరిష్కారానికి 118 జీవోలో యుఎల్‌సీ సమస్యను సవరించి పరిష్కారానికి హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. జేఎల్‌ఎస్‌నగర్‌లోని దేవాదాయశాఖ సమస్య, ఆర్‌కేపురం ఫ్లైఓవర్‌కు అదనంగా 3 లైన్ల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయని, గౌతంనగర్, వాజ్‌పేయ్‌నగర్ రైల్వే క్రాసింగ్‌ల వద్ద ఆర్‌యుబీలు నిర్మించేందుకు అధికారిక సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్, నాయకులు జేఏసీ వెంకన్న, అనిల్, రాము యాదవ్, అచ్యుతరావు, వెంకటయ్య, సత్యనారాయణ, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

ఘనంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం



రామంతాపూర్ : వెంకట్‌రెడ్డినగర్‌లోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. శనివారం అమ్మవారికి ఒడి నింపడం, నివేదన హారతి, మంత్ర పుష్పం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్ఛరణల మధ్య పార్వతీ పరమేశ్వరుల కల్యాణంతో పాటు శ్రీరామ చంద్రమూర్తి కల్యాణం రమణీయంగా జరిగింది. ఆలయ చైర్మన్ గంజు రాజమౌళి గుప్తా, పురుషోత్తం గుప్తా, కాచం కృష్ణమూర్తి గుప్తా, అధ్యక్షుడు భువనగిరి శ్రీనివాసులు గుప్తా, కోశాధికారి ఊరే నాగేష్ గుప్తా, రమేష్ గుప్తా, కొండయ్య గుప్తా, అమృతమ్మ, జయమ్మ, పద్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కులగణన నివేదికపై ఒక రోజు నిరశన

మల్కాజిగిరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బీసీ కులగణన నివేదికను నిరసిస్తూ మల్కాజిగిరిలో బీసీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఒక రోజు నిరాహార దీక్ష చేశారు. ఆనంద్‌బాగ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా సినీ నిర్మాత రాజు మాట్లాడుతూ.. బీసీల వాస్తవ లెక్కలను దాచి తక్కువ లెక్కలతో నివేదిక ప్రకటించారన్నారు. అధిక జనాభా ఉన్నప్పటికీ సామాజిక, ఆర్థిక, రాజకీయంగా వెనుకబడ్డామని ఐక్యంగా ఉన్నప్పుడే న్యాయమైన వాటాను దక్కించుకోగల్గుతామన్నారు. పాలకులు ఎవరున్నప్పటికీ వారి స్వార్థం కోసమే బీసీ కులాలను ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. ఐక్యవేదిక సీనియర్ నాయకుడు వీ.కే.మహేష్ దీక్షలో కూర్చున్న వారికి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు.



నిరశన శిబిరంలో మాట్లాడుతున్న రాజు

శ్మశానవాటికలను మరింత అభివృద్ధి చేస్తాం



శ్మశానవాటిక కమాన్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రజిత

ఉప్పల్: మున్నూరు కాపు, రెడ్డి కులస్తుల శ్మశానవాటికను మరింత అభివృద్ధి చేయనున్నట్లు స్థానిక కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఉప్పల్‌కు చెందిన నాయబు వేంకటేశ్వర్లు ఆయన తండ్రి హనుమంతు జ్ఞాపకార్థం నిర్మించిన శ్మశానవాటిక కమాన్‌ను స్థానికులు, సంఘం పెద్దలతో కలిసి ప్రారంభించారు. శ్మశాన వాటిక అభివృద్ధికి తొలి విడతగా రూ. కోటి ఐదు లక్షలు, రెండో విడతగా రూ. 45 లక్షల నిధులను మంజూరు చేయించినందుకు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మేకల మధుసూదన్‌రెడ్డి, దుబ్బ నర్సింహారెడ్డి, శామీర్‌పేట ధర్మారెడ్డి, మేకల హనుమంతురెడ్డి, నాయబు లక్ష్మమ్మ, నాగిరెడ్డి, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన



స్థానికులతో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, ఐజీ మింట్ కాలనీలో శనివారం కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలకు దశలవారీగా పరిష్కారం చూపుతానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. అనంతరం కాలనీలో వీధిదీపాల ఏర్పాటును ఆమె పరిశీలించారు. కాలనీల్లో ప్రధాన మార్గాల మీదుగా సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించి మరమ్మత్తులు చేపట్టాలని విద్యుత్‌శాఖ సిబ్బందికి సూచించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

కుషాయిగూడ: కుషాయిగూడలోని శ్రీసరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా స్థాయి ఖేల్ కూద్ పోటీలు నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, పరుగు పందెం, లాంగ్‌జంప్, హైజంప్, షార్ట్‌పుట్ పలు పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సరస్వతి విద్యాపీఠం జిల్లా కార్యదర్శి దూళిపాల కాశీవిశ్వనాథ్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. రమేష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



దృష్టి మరల్చి నగల దుకాణంలో చోరీ..

- సీసీఫుటేజీ ఆధారంగా నిందితుల గుర్తింపు
- రిమాండ్‌కు తరలించిన పోలీసులు

ఉప్పల్: నగల షాపుల్లో దృష్టి మరల్చి చోరీ చేసిన భార్యభర్తలను ఉప్పల్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. డీఐ రామలింగారెడ్డి తెలిపిన ప్రకారం.. నెల్లూరు జిల్లా అలూరు మండలం వైకుంఠపురానికి చెందిన కావలి లక్ష్మీ అలియాస్ చెంచమ్మ(35), భర్త కావలి తిరుపతి. కాగా వీరు ఒంటరిగా కౌంటర్‌పై ఉన్నవారిని, వృద్ధులను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతుంటారు. ఈనెల 7న మధ్యాహ్నం ఉప్పల్ భరత్‌నగర్‌లోని దేవీలాల్ పాన్ బ్రోకర్ షాపునకు ద్విచక్ర వాహనం (ఏపీ40డీజీ 4306)పై భార్యాభర్తలిద్దరూ వచ్చారు. కౌంటర్ వద్ద వృద్ధుడు ఒంటరిగా ఉండటాన్ని గమనించారు. లక్ష్మీ నగల షాపులోకి వెళ్లగా.. తిరుపతి బయట వేచి ఉన్నాడు. ముందుగా తన వద్ద హాల్‌మార్క్ ఉన్న నకిలీ బంగారాన్ని తాకట్టు పెట్టి రూ. 20 వేల నగదును తీసుకుంది. ఆ తరువాత బంగారు నాణాలను చూపించాలని కోరడంతో నాణాలు చూపిస్తుండగా.. దాదాపు 12 బంగారు నాణేలను దృష్టి మరల్చి దొంగిలించారు. యజమాని తేరుకుని చూసేసరికి తాకట్టు పెట్టిన బంగారం నకిలీదని, దాదాపు 17 గ్రాముల బంగారు నాణేలు కూడా కనిపించకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో వారు సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను అదుపులోకి తీసుకుని శనివారం రిమాండ్‌కు తరలించారు.

◆ నిందితుల నుంచి రూ. 1,20,000 నగదు, ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. 2016లో కూడా ఇదే తరహా కేసులో ఇద్దరూ జైలుకు వెళ్లి వచ్చారు.



పోలీసుల అదుపులో నిందితులు